

అన్న క్యాంటీన్లకు బ్రేక్

- ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రారంభం తాత్కాలికంగా వాయిదా
- హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ఆహార సరఫరా బాధ్యత

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎన్నికల కోడ్ ఉండడంతో అన్న క్యాంటీన్ల ప్రారంభం తాత్కాలికంగా వాయిదా పడింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలనుకున్నారు. అయితే ఈనెల 30న ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నిక జరగనున్నది. వచ్చే నెల ఆరో తేదీ వరకు కోడ్ అమలులో ఉండనున్నది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్ల ప్రారంభాన్ని వాయిదా వేశారు. కోడ్ ముగిసిన తరువాత క్యాంటీన్లు ప్రారంభించాలని నిర్ణయించారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి నుంచి అనకాపల్లి వరకూ మొత్తం 25 క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే భవనాలు సిద్ధం చేశారు. క్యాంటీన్లకు భోజనం సరఫరా బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు అప్పగించారు. క్యాంటీన్లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం రూ.5కే అందించనున్నారు. భోజనం తయారీ ప్రస్తుతానికి కంచరపాలెంలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన సెంట్రల్ కిచెన్‌లో చేపడతారు. తరువాత మాధవధార, బోయపాలెంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సొంతంగా కిచెన్లు సమకూర్చుకోనున్నది.

దారితప్పుతున్న యువత



క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్‌లో పేకాట/గేమ్స్‌కు వ్యసనపరులుగా మారుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు

- తక్కువ మొత్తంతో మొదలెట్టి... వేలు, లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న వైనం
- కుటుంబ సభ్యులకు తెలియకుండా బయట అప్పులు, అవి చెల్లించలేక తిప్పలు
- అప్పుల ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేని పరిస్థితి
- ఆలస్యంగా గుర్తిస్తున్న తల్లిదండ్రులు
- పిల్లల నడవడిక, ఖర్చులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచిస్తున్న మానసిక వైద్యులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి):

నగరంలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బీటెక్ చదువుతున్నాడు. కొద్దిరోజులుగా ముభావంగా ఉండడంతోపాటు ఇంట్లో వాళ్లను తరచూ డబ్బులు అడగడం మొదలెట్టాడు. ఎందుకని అడిగితే సమాధానం చెప్పడం లేదు. గట్టిగా నిలదీస్తే చనిపోతానంటూ బెదిరించసాగాడు. తల్లిదండ్రులకు విషయం ఏమిటో అర్థం కాక మానసిక వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. సదరు వైద్యుడు కౌన్సెలింగ్ నిర్వహించి మెల్లగా విషయాన్ని రాబట్టారు. తల్లిదండ్రులకు తెలియకుండా నాలుగు లక్షలు రూపాయలు అప్పు చేసి, ఆన్‌లైన్‌లో పేకాటలో పోగొట్టినట్టు చెప్పాడు.

విజయనగరం జిల్లాకు చెందిన యువకుడు నగరంలోని ఒక ప్రైవేటు వసతి గృహంలో ఉంటూ బీబీఏ చదువుతున్నాడు. కొద్దిరోజుల కిందట తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.5 లక్షలు అర్జంట్‌గా కావాలని అడిగాడు. ఎందుకంటే సమాధానం చెప్పలేదు. డబ్బు పంపిస్తేనే మీకు కనిపిస్తానని హెచ్చరించడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే నగరానికి చేరుకున్నారు. కుమారుడు ఆందోళనగా ఉన్నట్టు గుర్తించి మానసిక వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. అతడితో వైద్యుడు మాట్లాడగా బెట్టింగ్‌లో ఏడు లక్షల వరకు నష్టపోయినట్టు తెలిపాడు.



దేశ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యువకులు అడ్డదారులు తొక్కుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ వంటివి ఆడుతూ లక్షలాది రూపాయలను నష్టపోతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు డ్రగ్స్, మద్యం వంటి అలవాట్లకు బానిసలుగా మారుతూ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈ తరహా యువకుల సంఖ్య గత కొన్నాళ్లుగా పెరుగుతోంది. చెడు స్నేహాలు, అలవాట్లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వారిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ ఉండడం గమనార్హం. నగర, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా చిన్న వయసులోనే బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొదట తక్కువ మొత్తంతో ప్రారంభిస్తున్నారు. ఆ మొత్తాన్ని రాబట్టుకునే ప్రయత్నంలో వేలు, లక్షలు పోగొట్టుకుంటున్నారు. అందుకోసం దొరికిన చోటల్లా అప్పులు చేస్తున్నారు.

నిరుద్యోగి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకు

ఈ జాబితాలో ప్రధానంగా విద్యార్థులు, నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉంటున్నారు. నగర పరిధి ఎంవీపీ కాలనీ ప్రాంతానికి చెందిన ఒక యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ పని చేస్తున్న ఒక స్నేహితుడి ద్వారా ట్రేడింగ్ చేయడం ప్రారంభించాడు. తొలుత లాభాలు రావడంతో ఎక్కువ మొత్తాన్ని పెట్టుబడి పెట్టాడు. పది రోజుల వ్యవధిలోనే సుమారు రూ.20 లక్షల వరకూ నష్టపోయాడు. క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ యాప్‌లలో అప్పులు తీసుకుని మరీ పెట్టుబడి పెట్టిన సదరు యువకుడు...సమయానికి ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించక పోవడంతో వేధింపులు పెరిగాయి. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పలేక ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. సకాలంలో స్నేహితులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. తల్లిదండ్రులు అక్కడి నుంచి తీసుకు వచ్చేశారు. అప్పులు చెల్లించి జాగ్రత్తగా ఉండాలని సూచించడంతోపాటు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. నగరంలోని ప్రైవేటు కంపెనీలో పనిచేసే శ్రీకాకుళం జిల్లా యువకుడు రోజూ ఆన్‌లైన్‌లో పేకాట ఆడు తుండేవాడు. ఈ క్రమంలో అప్పుల పాలయ్యాడు. విషయం సోదరుడికి తెలియడంతో వచ్చి ఇంటికి తీసుకువెళ్లిపోయారు. అప్పటికే మూడు లక్షల రూపాయలు అప్పు చేసినట్టు తేలింది. దీంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి మరీ ఆ అప్పులు తీర్చారు.

పాన్‌కార్డ్, ఆధార్ కార్డుతో అప్పులు

అప్పులు ఇచ్చేందుకు అనేక రకాల యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. పాన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ ఉంటే చాలు అప్పులు ఇస్తున్నారు. అయితే, భారీ మొత్తంలో వడ్డీలు వసూలు ... మిగతా 6వ పేజీలో

ఏయూ మాజీ ఓఎస్‌డీ సిత్రాలు

- రాజీనామా చేసినా... ఇప్పటికీ అదే హోదాలో కాన్ఫరెన్స్‌లకు వెళుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్
- గత నెలలో శ్రీలంక సదస్సుకు హాజరు
- ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకాక్‌లో జరిగే కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం



ప్రొఫెసర్ కృష్ణమోహన్

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ఇప్పటికీ వర్సిటీకి చెందిన ఉన్నతాధికారిగానే పలు కాన్ఫరెన్స్‌లకు హాజరవుతుండడం చర్చనీయాంశంగా మారింది. గత నెలాఖరులో శ్రీలంకలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌కు ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) హోదాలో హాజరైన కృష్ణమోహన్...ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న మరో కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. సదరు కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ఆహ్వానపత్రంలో ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను ఓఎస్‌డీగానే పేర్కొనడం గమనార్హం. దీనిపై వర్సిటీ ఉన్నతాధికారులను వివరణ కోరగా...ఆయన ఓఎస్‌డీ పదవికి రాజీనామా చేశారని, అవి ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న సదస్సులు కావచ్చునని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రొఫెసర్ వడ్డాది కృష్ణమోహన్ మూడు పర్యాయాలు ఏయూ రిజిస్ట్రార్‌గా కొనసాగారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు ... మిగతా 6వ పేజీలో

స్మార్ట్ మీటర్లు

- రాష్ట్రంలో మొట్టమొదటగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏర్పాటుకు శ్రీకారం
- తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు...
- అనంతరం గృహ వినియోగదారులకు కేటాయింపు
- ఎక్కువ విద్యుత్ వాడే వారికి మాత్రమే ఏర్పాటు
- మొబైల్‌లా ముందస్తుగా రీచార్జి చేసుకోవలసి ఉంటుందన్న అధికారులు



స్మార్ట్ మీటరును బిగుస్తున్న సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ విశాఖపట్నంలో మొదలైంది. తొలి మీటరును సీతమ్మధారలోని ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. వీటిని మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలకు పెడతారు. ఈపీడీసీఎల్ (తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) పరిధిలో గల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం మూడు వేల వరకూ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతానికి 500 మీటర్లు మాత్రమే రావడంతో వాటిని అమరుస్తున్నారు. ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు ఇస్తారు. వారి సంఖ్య 1.1 లక్షల వరకూ ఉంది. ఇదంతా పూర్తయ్యాక గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అందిస్తారు. వారిలో కూడా అత్యధికంగా విద్యుత్‌ను ఉపయోగించే వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. రాయితీ విద్యుత్ వినియోగించుకునేవారికి, తక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లు వచ్చేవారికి స్మార్ట్ మీటర్లు ఇవ్వరు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 15 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా వారిలో ఐదు లక్షల మందికి వీటిని అమరుస్తారని, మిగిలిన వారికి అవసరం ఉండదని ఈపీడీసీఎల్ అధికార వర్గాలు తెలిపాయి.

ఎందుకీ స్మార్ట్ మీటరు?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లను అమరుస్తున్నారు. వీటి వల్ల ఎక్కడ?, ఎంత? విద్యుత్ వినియోగిస్తున్నదీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. అదేవిధంగా ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ సరఫరా ఉందా? లేదా? ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న లోడ్ వంటి అంశాలన్నీ పంపిణీ సంస్థ ... మిగతా 6వ పేజీలో

ఢిల్లీలో స్వాతంత్ర్య వేడుకలకు నగర విద్యార్థిని

- సాగర్‌నగర్‌కు చెందిన జయ లిఖితకు యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆహ్వానం
- దేశవ్యాప్తంగా 68 మందికి అవకాశం



జయ లిఖిత

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు నగరంలోని సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన వడిసిల జయ లిఖితకు ఆహ్వానం అందింది. జయలిఖిత సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో మూడో ఏడాది బీఏ చదువుతోంది. ఏటా ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ కల్పిస్తోంది. ఇందుకోసం మై భారత్ పేరుతో పోర్టల్‌ను ఏర్పాటుచేసింది. ఆయా కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. దేశవ్యాప్తంగా ఎన్‌వైకే విభాగంలో వేలాది మంది దరఖాస్తు చేయగా, 68 మందిని ఎంపిక చేసి ఆహ్వానాలను పంపింది. సామాజిక సేవా కార్యక్రమాలు, విభిన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కలిగించడం, నెహ్రూ యువకేంద్రం నిర్వ హించే కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని జయ లిఖితకు అవకాశాన్ని కల్పించింది. ఈ అవకాశం దక్కడం పట్ల జయ లిఖిత ఆనందాన్ని వ్యక్తంచేసింది. విశాఖ నెహ్రూ యువ కేంద్రానికి చెందిన విద్యార్థినికి కేంద్ర మంత్రిత్వ శాఖ అవకాశాన్ని కల్పించడం ఆనందంగా ఉందని జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేశ్వరరావు తెలిపారు.

ఏయూలో మాజీ వీసీ హవా!?

పెద్దల వత్తాసు



- సకాలంలో విధులకు హాజరుకాని ప్రసాదరెడ్డి
- ఆయన బదులు అటెండెన్స్ రిజిస్టర్‌లో మరొకరు సంతకాలు
- ఆ విషయం బయటకు వచ్చిందని కంప్యూటర్ సైన్స్ విభాగంలో 12 మందికి స్థానచలనం
- విద్యార్థుల వద్ద డబ్బులు తీసుకుంటున్నందుకు చర్యలు తీసుకున్నట్టు ప్రకటన
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామంటున్న సంబంధిత ఉద్యోగులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాజీ వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డిపై ఈగ వాలకుండా ప్రస్తుత ఉన్నతాధికారులు చూసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన వీసీగా ఉన్నప్పుడు చేసిన అక్రమాలపై పుంఖాను పుంఖాలుగా ఫిర్యాదులు అందుతున్నా వాటిని పక్కన పెట్టేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొన్నటివరకు వీసీగా వ్యవహరించిన ప్రసాదరెడ్డి ఇప్పుడు సాధారణ ప్రొఫెసర్. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి వెళ్లి అందరిలాగే పాఠాలు చెప్పాలి. ఇతర విధులు నిర్వహించాలి. కానీ ఆయన అలా చేయడం లేదు. తోటి ప్రొఫెసర్లు ఉదయం 9 గంటలకే వస్తుంటే...ఆయన తీరుబడిగా 11.30 గంటలు దాటిన తరువాత వస్తున్నారు. అప్పుడైనా క్లాసులకు వెళుతున్నారా?...అంటే అదీ లేదు. తన మందీ మార్బలంతో గదిలో కూర్చుని కాలక్షేపం చేస్తున్నారు. యూనివర్సిటీలో ఏ ప్రొఫెసర్‌కు అటెండర్ సౌకర్యం లేకపోయినా ఆయనకు కల్పించారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో ఆయనకు బదులు సంతకాలు వేరేవారు పెడుతున్నారు. ఇటీవల ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. నిజంగా ఏయూ పెద్దలకు చిత్తశుద్ధి ఉంటే ఆయన్ను సమయానికి రావాల్సిందిగా చెప్పొచ్చు. అటెండర్ సదుపాయాన్ని తీసేయవచ్చు. కానీ ఈ రెండూ చేయలేదు. ఈ విషయమై ఫిర్యాదు చేశారని ఒకరిని ఇంజనీరింగ్ సెక్షన్ నుంచి ఆర్ట్స్ సెక్షన్‌కు బదిలీ చేశారు. తాజాగా సీఎస్ఈ విభాగంలో పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది 12 మందిని మరో అధికారి శుక్రవారం తన గదికి పిలిపించుకున్నారు. ముందు వారందరినీ ఫోన్లు బయట పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఆ ప్రక్రియ పూర్తయ్యాక లోపలకు అనుమతించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో వివరాలన్నీ బయటకు వెళుతున్నాయని, పత్రికల్లో వస్తున్నాయని, అమరావతి నుంచి పెద్దలు ఫోన్లు చేసి ... మిగతా 6వ పేజీలో

ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు పెండింగ్

- విశాఖ జిల్లాలో 600 ఎకరాలకు సర్టిఫికెట్లు జారీచేసిన నాటి అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీచేసిన డీ పట్టా భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మూడు రోజుల క్రితం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయరాదని స్పష్టంచేసింది. గ్రామాల్లో నిరుపేదలకు 30 నుంచి 40 సంవత్సరాల క్రితం ఇచ్చిన భూములు (డీపట్టా) ఇప్పటికీ వారి చేతుల్లోనే ఉన్నట్టయితే ఫ్రీహోల్డ్ (పూర్తి హక్కు) కల్పిస్తామంటూ గత ప్రభుత్వం జీవో (నంబర్ 596) తీసుకువచ్చింది. ఆ సర్టిఫికెట్‌ను పొందినవారు భూములు విక్రయించుకోవచ్చునని ప్రకటించింది. అయితే దీని వెనుక పెద్ద కుట్ర జరిగింది. ఆ జీవో వస్తుందనే ముందే తెలుసుకున్న వైసీపీ నేతలు గ్రామాల్లో డీపట్టా భూములున్న రైతులతో మాట్లాడి రెండు, మూడు లక్షల రూపాయలు ఇచ్చి అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు. ఈ విధంగా విశాఖ జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో వైసీపీ నేతలతో పాటు నాటి ప్రభుత్వ ఉన్నతాధికారి బినామీ పేర్లతో రైతులతో ఒప్పందాలు చేసుకున్నారు. జీవో విడుదలైన అనంతరం జిల్లా అధికారులు సుమారు 600 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. ఆనందపురం మండలంలో అత్యధికంగా 414ఎకరాలు, పద్మనాభం మండలంలో 142 ఎకరాలు, పెందుర్తి మండలంలో 30ఎకరాలు, భీమిలి మండలంలో 19 ఎకరాలకు ఫ్రీహోల్డ్ ఇవ్వడంతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. తాజాగా ఆ రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీకావడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ వ్యవహారంపై ప్రభుత్వలోతుగా దర్యాప్తుచేయిస్తే వైసీపీ పెద్దల బండారం బయటపడుతుంది.

వైద్యునిగా మారిన పోలీస్ కమిషనర్



నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి వైద్యుని అవతారమెత్తారు. పాపాహోమ్‌లో శనివారం కేజీహెచ్ వైద్యులు శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన శంఖబ్రతబాగ్చి స్టెతస్కోప్‌తో అక్కడ పిల్లలను తనిఖీ చేశారు. శంఖబ్రత బాగ్చి తొలుత వైద్య విద్యను అభ్యసించారు. అనంతరం సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేరై ఐపీఎస్ అయ్యారు.

- వివరాలు I పేజీలో

ఎమ్మెల్సీపై తేల్చని కూటమి

- నేడు లేదా రేపు ఆరుగురు సభ్యుల కమిటీ సమావేశం
- వైసీపీ అభ్యర్థి బొత్స నామినేషన్ రేపు
- ఓటు కోసం వైసీపీ ఎంపీ, ఎమ్మెల్సీల దరఖాస్తు



విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల్లో పోటీ/అభ్యర్థి ఎంపికపై కూటమి నేతలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. ఈ విషయమై ముఖ్యమంత్రి నియమించిన ఆరుగురి సభ్యుల కమిటీ శనివారం విజయవాడలో భేటీ కావల్సి ఉంది. అయితే సభ్యుల్లో ఇద్దరు, ముగ్గురు అందుబాటులో లేకపోవడంతో ఆదివారం లేదా సోమవారం సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఇదిలావుండగా వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే రోజు మైదాన ప్రాంతానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను క్యాంపునకు తీసుకువెళతారని చెబుతున్నారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 13వ తేదీతో గడువు ముగుస్తోంది. అందువల్ల కూటమి పోటీ చేయదలచుకుంటే అభ్యర్థి పేరును సోమ, మంగళవారాల్లో ఖరారు చేయాల్సి ఉంటుంది. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి విడుదల చేసిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, కొత్త ఓటర్ల చేరికలకు గడువు ముగిసింది. చివరిరోజు వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణిలు ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేశారు.

కనకమహాలక్ష్మికి శ్రావణం పూజలు



శ్రావణలక్ష్మి అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, ఆగస్టు 10: వన్‌టౌన్ కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయంలో నిర్వహించిన కుంకుమపూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తులసీదళార్చన సేవలను ఆలయ అధికారులు, అర్చకులు ఉభయదాతలతో జరిపించారు. అమ్మ వారి దర్శనానికి భక్తులకు బారులుతీరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎన్‌సీసీ అధికారి గీతాంజలి ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న క్యాడెట్లు

విశాఖపట్నం, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్స్ వన్ క్యాడెట్, వన్ ప్లాంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారి కే గీతాంజలి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కలతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రకృతి సంపదను కాపాడుకునేందుకు ముందుకు రావాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, డాక్టర్ కేఎల్. శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్.అనురాధ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు గ్రామాలకు రోడ్డు నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కంచరపాలెం, ఆగస్టు 10: జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాలు బాపూజీ నగర్, పల్నాటి కాలనీ, నీలకంఠనగర్ తదితర గ్రామాలకు ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఈ గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. కార్పొరేటర్ సమస్యను జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించి నిధులు విడుదల చేయించడంతో రోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పంచగ్రామాలకు రోడ్డు నిర్మాణం పూర్తయితే,కొండపై నివాసముంటున్న తమకు రాకపోకలకు ఇబ్బందులు తప్పనుండడంతో స్థానికులుహర్షంవ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో భక్తులు కూర్చునేందుకు ఉన్న చిన్నపాటి స్థలం



బీటలువారిన ఆలయ గోడలు



శివలింగం వద్ద నిలిచిన వర్షంనీరు

అభివృద్ధికి దూరంగా శివరామకృష్ణ ఆలయం

- వందేళ్ల చరిత్ర గల దేవస్థానంపై నిర్లక్ష్యం
- గుడిలోకి వర్షం నీరు
- భక్తులు కూర్చునేందుకు స్థల సమస్య

డాబాగార్డెన్స్, ఆగస్టు 10: వందేళ్ల చరిత్రగల డాబాగార్డెన్స్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపాన అస్సాం గార్డెన్స్‌లో శివరామకృష్ణ దేవాలయం అభివృద్ధికి దూరంగా ఉంది. అప్పట్లో ములుకూరి సూరమ్మ అనే ఆమె గ్రామస్తుల సహకారంతో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి ప్రధానంగా పూజలందుకుంటున్నారు. విఘ్నేశ్వరస్వామి, ఉమాదేవి ఆలయం, రామాలయం, సూర్యనారాయణ,స్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాలు, అయ్యప్పస్వామి ఆలయం ఈ దేవస్థానంలో ఉప



నవగ్రహాల వద్ద విరిగిపోయిన టైల్స్

ఆలయాలుగా ఉన్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధిలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఆలయ నిర్మించి వందేళ్లు కావడంతో గుడి లోపల ప్రాంతాలు మరమ్మతుకు గురయ్యాయి. వర్షాకాలంలో పగుళ్లుదేరిన గోడల నుంచి సైతం నీరు లోనికి వస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతోపాటు ఉమాచంద్రమౌళీశ్వర స్వామి గుడిలోని శివలింగం పానవట్టం చుట్టూ నీరు బయటకు వచ్చేస్తోంది. దీంతో అభిషేకాలు నిర్వహించే సమయంలో అసౌకర్యంగా ఉంటోంది. దీంతోపాటుగా ఆలయంలోని ఎప్పటి నుంచే ఉప ఆలయాల వద్ద ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం అభివృద్ధి చేస్తే ఎప్పుడైనా స్వామి వారి కల్యాణోత్సవం, ఇతర వేడుకలు నిర్వహించే సమయంలో భక్తులు వీక్షించేందుకు వీలుగా పలువురు అభిప్రాయపడుతున్నారు. దేవదాయ అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి ఆలయ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించాలని కోరుతున్నారు.

అనధికారిక రోడ్డు తవ్వకం అడ్డగింత



తవ్విన రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నేత కిశోర్‌కుమార్

అక్కయ్యపాలెం, ఆగస్టు 10: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రోడ్డును తవ్వకాలు చేపట్టి సొంతంగా ఓ వ్యక్తి డ్రైనేజీ నిర్మించే ప్రయత్నాలను టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, రజక సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో గెడ్డకు ఆనుకుని ఓ బిల్డింగ్ ఉంది. అందులో షాపులు నిర్వహిస్తున్నారు. ఆ భవనం యజమాని షాపుల నిర్వహణ మొత్తం ఓ వ్యక్తికి అప్పగించడంతో అయన అత్యుత్సాహం చూపి ఏకంగా జీవీఎంసీకి సంబంధించిన రోడ్డునే తవ్వి డ్రైనేజీ నిర్మించేందుకు సిద్ధపడ్డాడు. గమనించిన స్థానికులు కార్పొరేటర్ ముక్కా శ్రావణికి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కు సమాచారమందించారు. వెంటనే కిశోర్‌కుమార్ నిర్మాణం చేపడుతున్న స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ పనులు స్థానికులు, రజక సంఘ నాయకులతో కలిసి అడ్డుకున్నారు. తవ్విన రోడ్డును వెంటనే కప్పేయాలని చెప్పారు.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు చేపట్టేలా సిఫార్సు చేస్తానని హెచ్చరించారు.

కాపునాడు నేతను కలిసిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ



నరసింహారావు నివాసంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతమ్మధార, ఆగస్టు 10: విశాఖ జిల్లా కాపునాడు అధ్యక్షుడు గంటూరు వెంకట నరసింహారావును దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ స్నేహపూర్వకంగా శనివారం సీతమ్మధారలోని ఆయన స్వగృహంలో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. నరసింహారావు, భారతీ దంపతులు ఎమ్మెల్యే వంశీని సత్కరించారు. అనంతరం వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నరసింహారావుతో తనకు ఎప్పటి నుంచో అనుబంధం ఉందని, ఈ నేపథ్యంలోనే రాజకీయాలకు అతీతంగా కలిసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో కలిసి ముందుకు సాగుతామన్నారు. జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడానికి శంకరమఠం రోడ్డులో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ డాక్టర్ సెల్ విభాగం డాక్టర్ బొడ్డేపల్లి రఘు, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గుంటూరు చిన్ని, జనసైనికులు దుర్గ, సురేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహం సందర్శన



ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో విద్యార్థినులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 10 : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల నుంచి 25 మంది బీఎస్సీ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థినులు టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహాన్ని శనివారం సందర్శించారు. స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యక్రమాలు, వాటి నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు తెలుసుకోవడం కోసం ఈ పర్యటన చేశారు. వారికి నిరాశ్రయుల వసతి గృహాల ఏర్పాటుకు సంబంధించిన సుప్రీంకోర్టు ఆదేశాలు, నిరాశ్రయుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలు, కేస్ స్టడీస్‌ను నిర్వాహకులు వివరించారు. కళాశాల ప్రతినిధి దీపాలి, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పాల్గొన్నారు.

'హాస్య కథలు రాయడం కష్టం'



హాస్య కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, ఆగస్టు 10: కథలు నిజ జీవితాలకు ప్రతిబింబాలని, వీటిలో హాస్యం రాయడం కష్టమని ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 38 మంది రచయితలతో కూడిన సంకలనం హాస్యానందం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గంగాధర్ వడ్లమన్నాటి సంకలన కర్తగా రూపొందించిన ఈ పుస్తకాన్ని హాస్యానంద మాసపత్రిక సంపాదకులు పి.రాము ఆవిష్కరించి తొలి ప్రతిని కథకులు రాజేశ్వరరావుకి అందించారు. రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు సమీక్షించారు.ఈ కార్యక్రమంలో అడపా రామకృష్ణ మేడా మస్తాన్‌రెడ్డి, డాక్టర్ డీవీజీ శంకరరావు, డాక్టర్ ఎం.సుగణరావు, నాగ వెంకట ఆంజనేయులు, బి. రత్నకుమారి, గొర్తి వాణిశ్రీనివాస్, సుసర్ల సర్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.

రైతు ప్రాముఖ్యత తెలుసుకోవాలి



నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ రవికిరణ్

సీతంపేట, ఆగస్టు 10: ప్రతి విద్యార్థీ రైతు పండించే పంటలను, వారి కష్టాలను తెలుసుకోవాలని డాక్టర్ వై.రవికిరణ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని రవీంద్రబారతి పాఠశాలలో వరి, కూరగాయలు, చిరుధాన్యాలు తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్ వ్యవసాయం ప్రాముఖ్యతను తెలిపే నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వై.రవికుమార్ ఈ నమూనాలు పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల చైర్మన్ సుబ్రహ్మణ్యం, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, సీజీఎం వసంత అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ సుధాలత, ప్రిన్సిపాల్ గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు



నృత్యకారులతో అతిథులు

సీతంపేట, ఆగస్టు 10: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కీర్తి ఆకాడమీ ఆధ్వర్యంలో నేషనల్ లెవెల్ డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు ప్రదర్శించిన జానపద, కూచిపూడి, కటక్ నృత్యాలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ డిప్యూటీ మేయర్, కళాకారుల సంఘం అధ్యక్షులు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈసందర్భంగా నృత్య కళాకారులను అభినందించారు. అనంతరం నృత్య గురువులైన ఆర్.రజని, అనిల్ తెలికిచర్ల, సౌమ్య తెలికిచర్ల, మంగళ దివ్య, బి.సుధాపౌర్ణిమ, కరణం కుమార్‌లను అతిథులు సన్మానించారు. ఈ కార్య క్రమంలో ఎంవీ సుబ్రహ్మణ్యం, ప్రత్యూష బళ్లమూడి, బాదంగీర్ సాయి, నటుడు ప్రకాష్, ఉమేష్ చంద్ర, బిందు లిమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



ప్రచారంలో పాల్గొన్న ప్రతినిధులు

కంచరపాలెం, ఆగస్టు 10 : జీవీఎంసీ 47వ వార్డు పరిధి రాంజీఎస్టేట్ గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హెర్బాన్ న్యూ లైఫ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొని దాతలనుంచి రక్తం సేకరించారు. సేకరించిన రక్తాన్ని విశాఖ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. పాస్టర్ మనీకుమార్ విలియమ్స్, ఇజ్రాయిల్, వార్డు టీడీపీ నాయకుడు రాజారావు తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి కృషి చేశారు. కాలనీలో అవగాహనకల్పించారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

సీతంపేట, ఆగస్టు 10: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సతీ సమేతంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయ సిబ్బంది గ్రంథాలయంలోని విభాగాలను, వసతులు, విద్యార్థులకు అందుబాటులో ఉంచిన పుస్తకాలను, గ్రూప్ పరీక్షల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను చూపారు. గ్రంథాలయం నిర్వహణ బాగుందని శంకరరావు ఆనందం వ్యక్తం చేశారు.

పేదలకు వైద్య నిపుణుల సేవలు దూరం

- పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల వైద్యం బంద్
- వైసీపీ పాలనలో నిర్ణయంతో ఇబ్బందులు

జగదాంబ కూడలి, ఆగస్టు 10: గ్రేటర్ విశాఖ పరిధిలో పేదల కోసం ఏర్పాటైన పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల వైద్య సేవలకు బ్రేక్ పడింది. ఎన్నికల ముందు గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ ఆరోగ్య కేంద్రాలను గత ప్రభుత్వంఅందుబాటులోకి తీసుకువచ్చింది.ఇందులో భాగంగా కనకమహాలక్ష్మి గుడిసమీపాన బురుజుపేట, పాతపోస్టాఫీసు, రెల్లివీధి వద్ద పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గతంలో ఈ కేంద్రాల ద్వారా వారంలో



పాతపోస్టాపీసు వద్ద పట్టణ ఆరోగ్య కేంద్రం

ఒకరోజు ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, న్యూరోతోపాటు మరికొన్ని స్పెషాలిటీ వైద్యసేవలు రోగులకు అందుబాటులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలలముందు ఈ ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్య సేవలను పూర్తి నిలిపివేసింది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు స్పెషాలిటీ వైద్యం అందడంలేదు. పెద్దాసుపత్రికి వెళ్లలేని పరిస్థితుల్లో అనారోగ్యంతో బాధపడుతున్నట్టు రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైద్య నిపుణుల సేవలు లేక ఈ కేంద్రాలకువచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తిరిగి స్పెషాలిటీ వైద్య సేవలనుఅందుబాటులోకి పలువురు కోరుతున్నారు.

ఏయూ మాజీ ఓఎస్‌డీ సిత్రాలు

... 5వ పేజీ తరువాయి

గత వీసీ రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అవకాశాన్ని కల్పించారు. రిజిస్ట్రార్ బాధ్యతలు నుంచి తప్పుకున్న తరువాత ఓఎస్‌డీ పేరుతో ప్రత్యేకంగా పోస్టును సృష్టించి ఆయన్ను నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జూన్ నెలాఖరులో వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ పదవులకు ప్రసాదరెడ్డి, జేమ్స్ స్టీఫెన్, కృష్ణమోహన్ రాజీనామా చేశారు. అయితే, అంతర్జాతీయంగా పలు దేశాల్లో జరుగుతున్న కాన్ఫరెన్స్‌లకు మాత్రం కృష్ణమోహన్ ఇప్పటికీ ఓఎస్‌డీ హోదాలోనే హాజరవుతుండడంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

దారితప్పుతున్న యువత

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. ఈ తరహా యాప్‌లు, కొందరు అప్పులు క్లియర్ చేసినా వారిని వేధింపులకు గురి చేస్తున్నాయి. ఇదిలావుండగా సులభంగా అప్పులు దొరుకు తుండడంతో ఇంట్లో తెలియకుండానే చాలామంది ఈ తరహా దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. ఈ అప్పులు భవిష్యత్తులో వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్న విషయాన్ని గ్రహించడం లేదు.

ఆర్థిక అవసరాలపై దృష్టి అవసరం

పిల్లల ఖర్చుపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. అప్పుడే ఈ తరహా వ్యసనాలకు ప్రాథమిక దశలోనే అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. ఖరీదైన వస్తువులు కొనుగోలు చేయడం, ఇంట్లో అవసరాలను తీర్చే పనులు చేయడం, ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు అడగకపోవడం, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బులు అడగడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, ఒంటరిగా ఉండేందుకు యత్నించడం వంటివి చేస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. కొన్నిసార్లు బంధువులు వద్ద కూడా అప్పులు చేస్తుంటారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే వేగంగా వాటి నుంచి దూరంగా ఉండేలా చేయవచ్చునని చెబుతున్నారు. ఆలస్యం అయితే ఆర్థికంగా తీవ్రస్థాయిలో నష్టపోవడంతోపాటు కొన్నిసార్లు పిల్లల ప్రాణాలు కోల్పోవచ్చునని చెబుతున్నారు.

పిల్లల ఆర్థిక అవసరాలను నిశితంగా గమనించాలి

- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి

గతంతో పోలిస్తే పిల్లలు వ్యవహారశైలిలో పూర్తిగా మార్పు వచ్చింది. కుటుంబ పరిస్థితి, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆడంబరాలకు పోతున్నారు. అదే ప్రమాదానికి హేతువుగా మారుతోంది. పెద్దింటి పిల్లలతో సమానంగా బతకాలనే ఆలోచనలో నుంచి పుట్టుకు వస్తున్నవే ఈ తరహా దురలవాట్లు. ఎవరో ఆడుతున్నారని వీళ్లు నేర్చుకుంటున్నారు. డబ్బులు లేక పోతే అప్పులు చేస్తున్నారు. కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు కూడా పిల్లలు ఆనందంగా ఉండాలని ఆర్థిక పరి స్థితులకు మించి వారి అవసరాలను తీరుస్తున్నారు. వేలాది రూపాయల ఫోన్లు, బైక్‌లు కొనిస్తున్నారు. ఇవి దురలవాట్ల వైపు పిల్లలు మొగ్గేలా చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ అవసరాలకు డబ్బులు ఇవ్వకపోతే కొందరు పిల్లలు అప్పులు, రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల కిందట హైవేపై దొంగతనాలకు పాల్పడుతున్న 15 మందిని పట్టుకున్నారు.వీరంతా చదువుకుంటున్నవాళ్లే.దొంగతనాలు చేయడానికి కారణాలు తెలుసుకుంటే ఆన్‌లైన్ గేమ్స్, ఖరీదైన బైక్స్ మెయింటెనెన్స్ కోసం అని చెప్పారు. ఇటువంటి వ్యవహారాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు మోరల్ వాల్యూస్ చెప్పాలి.ఆర్థిక స్థితిగతులు, తమ కుటుంబ పరిస్థితులు వివరించాలి. మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లు వల్ల కలిగే అనర్థాలను చిన్న వయసులోనే తెలియజేయాలి.

స్మార్ట్ మీటర్లు

... 5వ పేజీ తరువాయి

అధికారులు కార్యాలయం నుంచి తెలుసుకోవచ్చు. స్మార్ట్ మీటరు ఏర్పాటుచేసుకున్న వారు దానిని మొబైల్‌లాగే ముందుగా డబ్బులు కట్టి రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెలా పది నుంచి పదిహేను రోజుల వ్యవధిలో బిల్లులు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక..అలా కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తున్నదో సగటున అంచనా వేసి, ఆ మొత్తం ముందుగానే చెల్లించి మీటరును రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ఆ మొత్తం ఎంత అనేది వినియోగం బట్టి మారుతుంది. ఒక్కోసారి అధికంగా విద్యుత్‌ను ఉపయోగిస్తే రీచార్జి చేసుకున్న మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయాల్లో వినియోగదారుల మొబైల్‌కు సమాచారం పంపిస్తారు. వినియోగించిన విద్యుత్, రీచార్జి చేసిన మొత్తం, ఇంకా ఎంత రీచార్జి చేసుకోవాలో తెలియజేస్తారు. దీనివల్ల విద్యుత్ పంపిణీ సంస్థలకు 100 శాతం బిల్లింగ్, పేమెంట్ జరుగుతుంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల నుంచి బయటపడడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూళ్లు

ప్రస్తుతం విద్యుత్ పంపిణీ సంస్థలకు వాణిజ్య, గృహ వినియోగదారుల నుంచి బిల్లుల వసూళ్లలో పెద్దగా సమస్యలు లేవు. 98 శాతం వసూలైపోతున్నాయి. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలే బిల్లులు ఏళ్ల తరబడి కట్టడం లేదు. బకాయిలు కోట్ల రూపాయల్లో ఉన్నా పంపిణీ సంస్థలు చర్యలు చేపట్టలేకపోతున్నాయి. ఇతర వినియోగదారుల్లా సరఫరా నిలిపివేయడం, నోటీసులు ఇవ్వడం వంటివి చేయలేకపోతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటీ పార్కులో ఇన్నోవేషన్ సొసైటీ కలసి రూ.10 కోట్ల మొత్తం చెల్లించాల్సి ఉంది. అయినా వాటికి సరఫరా ఇస్తూనే ఉన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే ఇలాంటి బకాయిల బెడద ఉండదు. ఆయా సంస్థలు కూడా ముందుగానే వారి మీటర్లను రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రతి కార్యాలయం అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటుంది. అందుకే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యాంబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఏయూలో మాజీ వీసీ హవా!?

... 5వ పేజీ తరువాయి

వివరణలు అడుగుతున్నారని, తాను సమాధానం చెప్పుకోవలసి వస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీ పద్ధతి మార్చుకోకపోతే వేరే విభాగానికి బదిలీ చేస్తా' అంటూ హెచ్చరించి పంపించారు. అదేరోజు సాయంత్రం ఆ అధికారి కార్యాలయం నుంచి విలేకరులకు ఫోన్లు వచ్చాయి. సీఎస్ఈ విభాగంలో 12 మందిని వేరే సెక్షన్‌కు బదిలీ చేసినట్టు సమాచారం ఇచ్చారు. వారంతా విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, దానిపై గవర్నర్‌కు ఫిర్యాదు వెళ్లిందని, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. ఇదే విషయం శనివారం అన్ని పత్రికల్లో రావడంతో ఆ 12 మంది ఆశ్చర్యపోయారు. ప్రసాదరెడ్డికి సంబంధించిన సమాచారం బయటకు ఇస్తున్నందుకు చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారని, కానీ డబ్బులు వసూలు చేస్తున్నందుకు చర్యలు తీసుకున్నామని పత్రికలకు చెప్పడం ఏమిటని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని, దీనిపై ఉన్నతాధికారులను కలిసి మాట్లాడతామని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విద్యార్థుల నుంచి వసూళ్లపై గవర్నర్ చర్యలా?

విద్యార్థులు సరిగా కాలేజీకి రారని, వారికి అటెండెన్స్ విషయంతో ఈ దిగువ స్థాయి సిబ్బంది సాయం చేసి డబ్బులు తీసుకుంటారనేది సదరు అధికారి ప్రధాన ఆరోపణ. అయితే ఇలా తక్కువ అటెండెన్స్ ఉన్నవారిని గుర్తించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేయడం ఆచరణలో ఉన్న విధానం. అప్పటికీ అటెండెన్స్ సరిపోకపోతే హెచ్ఓడీలే వారితో అపరాధ రుసుము కట్టించుకుంటారు. ఇది అన్ని విభాగాల్లో జరిగేదే. ఒక్క సీఎస్ఈలోనే ఇది జరుగుతున్నట్టుగా చెప్పడం, దానికి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపించడంపై పలువురు ప్రొఫెసర్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఏయూలో అడ్డగోలు నియామకాలు, నిధుల దుర్వినియోగం, అనర్హులకు పీహెచ్‌డీల ప్రదానం వంటి అంశాలపై గవర్నర్‌కు ఇరవైకి పైగా ఫిర్యాదులు పంపామని, వాటిపై కాకుండా అటెండర్లపై చర్య తీసుకోవాలని గవర్నర్ ఆదేశించారని చెప్పడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. తక్షణమే వారి సెక్షన్ మార్పును ఆపాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారిని దండించాలి గానీ ఎవరినో కాపాడడానికి ఇలాంటి చర్యలకు దిగడం వివాదాన్ని పెద్దది చేయడమే అవుతుందని అభిప్రాయపడ్డారు.

వృద్ధులకు వితరణ

పూర్ణామార్కెట్, ఆగస్టు 10: టీడీపీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు స్టాండింగ్ కమిటీ మెంబరుగా ఎన్నికైన సందర్భంగా శనివారం గ్రేటర్ 39 వార్డులో ఉన్న స్వామివివేకానంద ఆశ్రమంలో పరిసర ప్రాంత పేదలు, వృద్ధులకు అన్నదానం, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తి మంగరాజు, సురేష్, నిమ్మశ్రీనివాస్ పాల్గొన్నారు.


గణబాబుతో ఈఎన్‌సీ టీఎన్‌టీయూసీ సభ్యులు

ఎస్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలని గణబాబుకు వినతి

గోపాలపట్నం, ఆగస్టు 10: డాక్‌యార్డు వంతెనను మూసివేసిన నేపథ్యంతో ఎస్‌బీసీ బ్రిడ్జిపై నుంచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును ఈఎన్‌సీ టీఎన్‌టీయూసీ సభ్యులు కోరారు. గోపాలపట్నంలోని గణబాబు నివాసంలో ఆయనను శనివారం వారు మర్యాదపూర్వకంగా శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్‌యార్డు ఉద్యోగుల సమస్యలను వివరించారు. దీనిపై గణబాబు స్పందిస్తూ వంతెన విషయంపై ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించామని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో పరిష్కారానికి కొంత జాప్యం నెలకొందన్నారు. త్వరలో కలెక్టర్‌తో పాటు నేవీ అధికారులు, యూనియన్ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

క్రాంతినగర్‌కు 38జే బస్సు పునరుద్ధరణ

సింధియా, ఆగస్టు 10: ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సు నుంచి క్రాంతినగర్‌కు (38జే) బస్సు పునరుద్ధరించారు. ఇంతవరకు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జనతా కాలనీ వరకు తిరిగే ఈ బస్సును శనివారం నుంచి క్రాంతినగర్‌కు పొడిగించారు. కరోనాకు ముందు ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి క్రాంతినగర్ వరకు ఈ బస్సు రవాణా సేవలందిచేది. అయితే కొవిడ్ సమయంలో దీనిని నిలిపివేశారు. ఆ తర్వాత ఈ బస్సును జనతాకాలనీ వరకు ఆపరేట్ చేసేవారు. దీంతో క్రాంతి నగర్ వాసులు తమ ప్రాంతానికి బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల సకాలంలో డ్యూటీలకు వెళ్లలేకపోతున్నామని సమస్యను కార్పొరేటర్ గల్లా చిన్న దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు సమస్యను వివరించడంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు స్పందించి కాంప్లెక్స్ నుంచి క్రాంతి నగర్‌కు 38జే బస్సు సర్వీసును పొడిగించారు.

అమ్మవారి ఆలయానికి వెండి విరాళం

కూర్మన్నపాలెం, ఆగస్టు 10: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ సమీపంలోని రాసాలమ్మ అమ్మవారి ఆలయానికి శనివారం శివాజీ నగర్‌కు చెందిన భక్తులు గుత్తికొండ కృష్ణబాబు, రమాదేవి కిలో వెండిని విరాళంగా అందజేశారు. ఈ వెండితో అమ్మవారికి ఆభరణాలు చేయించాలని ఆలయ కమిటీ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు వెంకట సుబ్బయ్య, మూర్తి, మురళీమోహన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భెల్ కార్మికులకు వాచీలు పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 10: పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న భెల్ హెచ్‌పీవీపీ కార్మికులకు శనివారం యాజమాన్యం వాచీలను బహుమతులుగా పంపిణీ చేసింది. భెల్ సంప్రదాయం ప్రకారం పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన కార్మికులకు బహుమతులిస్తుంది. ఈ మేరకు 430 మంది కార్మికులకు యాజమాన్యం తరపున సీనియర్ మేనేజర్ జి.చంద్రశేఖర్ వాచీలను అందజేశారు. గుర్తింపు కార్మిక సంఘ నాయకులు కొల్లి దేముడు, సాహు, బాబూరావు, పీవీఎస్ రాజు, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి శ్రావణ శనివారం పూజలు

పెదగంట్యాడ, ఆగస్టు 10: శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా ఇక్కడి వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకాలు, కొత్త వస్త్రాలు, తులసీమాలలతో శ్రీవారిని అలంకరించాక ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం సమారాధన చేపట్టారు.

87వ వార్డులో ఆలయ శిఖరానికి..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాళింగుల వీధిలో పంచముఖేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా కణితి గ్రామదేవతల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆలయ శిఖర పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, టి.గురుమూర్తిరెడ్డి, టి.నాగిరెడ్డి, కమిటీ పెద్దలు పి.వేణుబాబు, శంకరరావు, శ్రీనివాస్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 29, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 46, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 28, కీరదోస 30, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	78
ఫారం ధర	--	98
విత్ స్కిన్	--	166
స్కిన్‌లెస్	--	176

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఇష్టారాజ్యంగా పశువుల సంచారం

రహదారులు, మార్కెట్లలో గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో బెంబేలెత్తిపోతున్న వాహనదారులు, కొనుగోలుదారులు

జరిమానాలు విధిస్తున్నా పట్టించుకోని పశువుల పెంపకందారులు


గాజువాక మెయిన్ రోడ్డుపై గుంపుగా ఉన్న ఆవులు

గాజువాక, ఆగస్టు 10: గాజువాక ప్రధాన రహదారులు, కూరగాయల మార్కెట్లలో విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రోడ్లపై అడ్డంగా పశువులు నిలుస్తుండడంతో వాటిని తప్పించుకుని వెళ్లే క్రమంలో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గాజువాక మెయిన్ రోడ్డులో పశువుల సంచారం అధికంగా ఉంది. అలాగే కణితి రోడ్డు, బీసీ రోడ్డు, హైస్కూల్ రోడ్డు ప్రాంతాల్లో పశువుల బెడద ఎక్కువగా ఉంటుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సంబంధిత విభాగం సిబ్బంది అప్పుడప్పుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రహదారులపై సంచరించే పశువులను వ్యాన్లలో నగరంలోని పశు సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు. దీంతో పశు యజమానులు జీవీఎంసీకి జరిమానా చెల్లించి వాటిని తీసుకువస్తున్నారు. అయితే ఆ తర్వాత నుంచి షరా మామూలుగా తమ పశువులను రోడ్లపై ఇష్టారాజ్యంగా వదిలేస్తున్నారు. జరిమానాలు చెల్లించినా పశువుల పెంపకందారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదని సంబంధిత విభాగ సిబ్బంది పేర్కొంటున్నారు.

కూరగాయల మార్కెట్లలో..

కూరగాయల మార్కెట్లలో పశు సంచారం చాలా ఎక్కువగా ఉంటుంది. కూరగాయలకు సంబంధించిన వ్యర్థాలను తినేందుకు గుంపులు గుంపలుగా మార్కెట్ల లోపలకు వస్తున్నాయి. రద్దీగా ఉండే మార్కెట్లలో ఒక్కసారి వేగంగా దూసుకుంటూ పశువులు వస్తుండడంతో కొనుగోలుదారులు భయంతో పరుగులు తీస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఒక్కసారి కిందపడి గాయాలైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కాగా పాత గాజువాక ప్రధాన కూరగాయల మార్కెట్లో అయితే పశువులు మరింత అధికంగా సంచరిస్తుండడంతో ఇక్కడకు వచ్చేవాళ్లు భీతిల్లుతున్నారు. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా కొనుగోలుదారులను తోసుకుంటూ ఆవులు, గేదెలు వంటివి వెళుతుండడంతో కొనుగోలుదారులు కింద పడుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి పశువులు రహదారులపై, మార్కెట్లలో సంచరించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటులో విచ్చలవిడిగా..

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటులోనూ పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఎక్కడికక్కడ పశువులు తిరుగుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్లాంటులోని ప్రధాన రహదారులతో పాటు పని ప్రదేశాల్లో, ఇలా ఎక్కడ పడితే అక్కడ పశువులు ఉండడం వల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటు లోపలకు పశువులు రాకుండా చూడాలని అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతుందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉక్కు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 16న జీతాలు?

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 10: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఇప్పటివరకు జూలై నెలకు సంబంధించిన జీతాలు అందలేదు. గత కొన్ని నెలలుగా ఉక్కు ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఆలస్యం చోటుచేసుకుంటుంది. గత నెల స్టీల్‌ప్లాంటుకు విచ్చేసిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి దృష్టికి త విషయాన్ని కార్మిక సంఘాల నాయకులు తీసుకువెళ్లడంతో ఆ మరుసటి రోజు సగం జీతం యాజమాన్యం జమ చేసింది. ఆ తర్వాత కొద్ది రోజులకు మిగతా సగం జీతం అందించింది. అయితే ఈ నెల ఒకటో తేదీన జీతం వస్తుందని ఉద్యోగులందరూ ఆశించినా ఫలితం లేకుండా పోయింది. ప్రతినెల మాదిరిగానే ఈ నెల కూడా రెండు వాయిదాల్లో జీతం ఇస్తారా, లేక ఒకేసారి చెల్లిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. పూర్తి జీతం ఒకేసారి ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. కాగా ఈ నెల 16న ఉద్యోగులకు జీతం ఇచ్చే అవకాశం ఉందని కార్మిక నాయకులు తెలిపారు.

పెండింగ్ చలానాల సొమ్ము వసూలుపై పోలీసుల దృష్టి

గాజువాక, ఆగస్టు 10: నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపిన వారికి విధించిన చలానాలకు సంబంధించిన నగదు వసూలుపై ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించారు. పెండింగ్ చలానాలు ఉన్నవారి వాహనాలు ఆపి నగదు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం గాజువాకలో పలు వాహనాలను ఆపి పెండింగ్ చలానాలను తక్షణమే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై విదసం సమావేశం

కూర్మన్నపాలెం, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఆర్టికల్ 341ను పునఃసమీక్ష చేయాలని విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు కోరారు. కూర్మన్నపాలెం ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో ప్రాంగణంలో శనివారం విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రాష్ట్రాలు ఈ తీర్పును వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణపై వచ్చిన తీర్పుపై తాము చర్చలు జరిపామన్నారు. దళిత రిజర్వేషన్లలో క్రిమిలేయర్, వర్గీకరణ, తద్వారా ఎస్సీ ఉపకులాలకు వచ్చే ఉమ్మడి ప్రయోజనాలు, నష్టాల గురించి ఈ సందర్భంగా చర్చించారు. సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల ప్రతినిధులు తిరుపతిరావు, రవిప్రకాశ్, సుజాత, సుధాకర్, శ్రీనివాస్, ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

దువ్వకొండపై అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట

తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడి

రెండు లారీలు, ఎక్స్‌కవేటర్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న లారీతో సిబ్బంది

పెందుర్తి, ఆగస్టు 10: మండలంలోని ఎస్ఆర్‌పురం దువ్వకొండపై క్వారీలో అక్రమ తవ్వకాలకు రెవెన్యూ శాఖ అడ్డుకట్ట వేసింది. ఈ క్వారీలో కొంతకాలంగా అర్ధరాత్రి దాటిన తర్వాత అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లారీల్లో తరలిస్తున్నారు. దీంతో మైనింగ్ మాఫియాపై తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం వేకువజామున లారీలతో మట్టిని తరలిస్తుండటంతో తహసీల్దార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. సంఘటనా స్థలంలో మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులకు తహసీల్దార్ సమాచారం అందజేశారు. దువ్వకొండ చుట్టూ తవ్వకాలు జరకుండా ఎక్స్‌కవేటర్లతో ట్రెంచ్‌లు తీయించారు. అలాగే కొండ హద్దులను గుర్తించారు. క్వారీలో ఉన్న రాయి, గ్రావెల్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దువ్వకొండ విస్తీర్ణం, అక్కడ ఎంతమంది అసైన్డ్ భూముల్లో రైతులున్నారు, క్వారీ తవ్వకాలకు గల అనుమతులపై ఆరా తీశారు. ఇక్కడ తవ్వకాల లీజు పూర్తిగా రద్దయిందని తహసీల్దార్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండను గుల్ల చేసి, రాయి, గ్రావెల్ తరలించుకుపోయారు. అయినా, మైనింగ్, గనుల శాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించినట్టు ఆరోపణలున్నాయి. చివరికి రెవెన్యూ సిబ్బంది చొరవ తీసుకుని కేసులు నమోదు చేసినా, ఆ శాఖలో కదలిక లేకపోవడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

'ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'

గాజువాక, ఆగస్టు 10: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందని టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ప్రజలంతా ఆనందంగా ఉండాలన్నదే లక్ష్యమన్నారు. ఎన్నికల సమయంలో హామీలన్నింటిని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. సమావేశంలో నాయకులు వెంకటరమణ, అనంత్, సింహాద్రి, ఉగ్రం, దేవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు కృషి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి


ముఖాముఖి కార్యక్రమంలో సీపీకి బుక్‌లెట్ అందిస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 10: నగరంలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీపీ శంఖబ్రత బాగ్చి అన్నారు. 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డి జంక్షన్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో రౌడీషీటర్లు ఉండరాదని, మత్తు పదార్థాలు, గంజాయి సేవించడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్ర తలను కాపాడేందుకు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసేం దుకు, దొంగతనాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తనకు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ తమవద్ద తమ సమీప పోలీస్ స్టేషన్ నంబర్‌ను ఉంచుకోవాలని, అత్యవసర సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. జూదం, మత్తు పదార్థాలు సేవించడం, అమ్మాయిలను వేధించడం వంటివి చేస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని, అటువంటి వారి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. రాత్రి సమయంలో కొంతమంది అపరిచితులు వేగంగా వాహనాలు నడుపుతున్నారని, అప్పికొండ బీచ్ వద్ద భద్రతను పెంచాలని, ఇది రూరల్ ప్రాంతం కాబట్టి ఆటోలకు, ఇతర ప్రయాణికుల వాహనాలకు జీపీఎస్ అమర్చాలని, స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు నుంచి శివారు ప్రాంతాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. శివారు ప్రాంతాల్లో రాత్రి సమయంలో గస్తీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీపీ తుసిన్‌సిన్హా, ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ సీఐలు ఎర్రంనాయుడు, వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్ సిబ్బంది యోగక్షేమాలపై సీపీ ఆరా

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం రాత్రి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డు రూములు, స్వాధీనం చేసుకున్న ప్రాపర్టీని పరిశీలించారు. కేసుల వివరాల సీడీ ఫైల్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల కాలంలో చట్టాలలో చోటుచేసుకున్న మార్పుల గురించి వివరించారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంచేందుకు తీసుకున్న చర్యలకు గాను సీఐ వి.శ్రీనివాసరావును సీపీ ప్రత్యేకంగా అభినందించారు. సిబ్బందికి ఏమైనా సమస్య లుంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజల్లో మంచిపేరు తెచ్చుకునేలా విధులు నిర్వర్తించాలని సీపీ సూచించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 10: స్టీల్‌ప్లాంట్ డీఏవీ స్కూల్‌లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. జోన్-ఏలోని బుచ్చిరాజుపాలెం, ఒనక ఢిల్లీ, పాలకొండ, రాజాం, అనకాపల్లి, సుజాతనగర్, ఉక్కునగరం పాఠశాలలకు చెందిన సుమారు 360 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్టీల్‌ప్లాంట్ జీఎం ఎం.మధుసూదనరావు మాట్లాడుతూ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అందరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకర్ బసవ, పలువురు ఉక్కు అధికారులు, వివిధ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

అగనంపూడి, ఆగస్టు 10: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఇ-మర్రిపాలెం నుంచి పెదముషిడివాడ వరకు ఉన్న మార్గాన్ని బీటీ రోడ్డుగా నిర్మించాలని కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు జనసేన నాయకుడు దుల్ల రామునాయుడు ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు శనివారం వినతిపత్రం అందజేశారు. మట్టి రోడ్డు కావడంతో ఈ రహదారి పొడవునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో పెదముషిడివాడ వెళ్లాలంటే ఫార్మాసిటీ పునరావాస కాలనీ, లంకెలపాలెం మీదగా సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందన్నారు. అందువల్ల ఈ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు గ్రామస్థులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన నాయకులు గణపతి, సతీశ్, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 10: ఎన్ఏడీ కొత్తరోడ్డు సమీపంలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ గోపాలపట్నండివిజన్ సంయుక్తంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలు, వృద్ధులకు గుండె జబ్బులకు సంబంధించి ఈసీజీ, గర్భస్థ ముఖద్వార క్యాన్సర్‌కు సంబంధించి స్కానింగ్, బీపీ, షుగర్ టెస్టులు చేశారు. మెడికవర్ వైద్యులు, సిబ్బంది వైద్య సేవలందించారు. సీఐటీయూ నాయకులు పి.అనసూయ, బి.వెంకటరావు, వి.ప్రభావతి, ఆర్.మల్లేశ్, వైద్యులు సాయి చందు, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, ఆగస్టు 10: వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని సాయినగర్, అశోక్‌నగర్, ఎస్సీ కాలనీ, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రతించాలన్నారు. సమీప ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు దోమల నిర్మూలనకు తక్షణమే ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీజనల్ వర్కర్ పప్పల మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలి

మల్కాపురం, ఆగస్టు 10: ఈపీఎఫ్-95 పెన్షనర్లకు ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన ఏపీఆర్‌పీఏ ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పోరాటం చేయాల్సి వస్తుం దన్నారు. ఢిల్లీలో చేపట్టనున్న ఆందోళనకు సంబం ధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధి సీహెచ్ తమ్మారావు, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై నేడు అవగాహన శిబిరం

పెందుర్తి-రూరల్, ఆగస్టు 10: గ్రేటర్ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం బ్రహర్షి పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆదివారం మధుమేహంపై అవగాహన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు సీనియర్ పిరమిడ్ మాస్టారు మళ్ల ఆత్మానందం తెలిపారు. డయాబెటిస్ రావడానికి గల కారణాలు, ముందస్తు నివారణ, చికిత్సా పద్ధతులను స్పిరిట్యువల్ టాబ్లెట్స్ సీనియర్ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి వివరిస్తారని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ శిబిరం కొనసాగుతుందని, ఆసక్తి గల వారందరూ పాల్గొనవలసిందిగా కోరారు. ఇక్కడకు వచ్చిన వారికి ఉచిత భోజన, వసతి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణం పూజలు



శ్రావణలక్ష్మి అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, ఆగస్టు 10: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయంలో నిర్వహించిన కుంకుమపూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తుల సీదళార్చన సేవలను ఆలయ అధికారులు, అర్చకులు ఉభయదాతలతో జరిపించారు. అమ్మ వారి దర్శనానికి భక్తులకు బారులుతీరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎన్‌సీసీ అధికారి గీతాంజలి ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న క్యాడెట్లు

విశాఖపట్నం, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్స్ వన్ క్యాడెట్, వన్ ప్లాంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారి కే గీతాంజలి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కలతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రకృతి సంపదను కాపాడుకునేందుకు ముందుకు రావాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, డాక్టర్ కేఎల్. శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్.అనురాధ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు గ్రామాలకు రోడ్డు నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కంచరపాలెం, ఆగస్టు 10: జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాలు బాపూజీ నగర్, పల్నాటి కాలనీ, నీలకంఠనగర్ తదితర గ్రామాలకు ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఈ గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. కార్పొరేటర్ సమస్యను జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించి నిధులు విడుదల చేయించడంతో రోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పంచగ్రామాలకు రోడ్డు నిర్మాణం పూర్తయితే,కొండపై నివాసముంటున్న తమకు రాకపోకలకు ఇబ్బందులు తప్పనుండడంతో స్థానికులుహర్షంవ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో భక్తులు కూర్చునేందుకు ఉన్న చిన్నపాటి స్థలం



బీటలువారిన ఆలయ గోడలు



శివలింగం వద్ద నిలిచిన వర్షంనీరు

అభివృద్ధికి దూరంగా శివరామకృష్ణ ఆలయం

- వందేళ్ల చరిత్ర గల దేవస్థానంపై నిర్లక్ష్యం
- గుడిలోకి వర్షం నీరు
- భక్తులు కూర్చునేందుకు స్థల సమస్య

డాబాగార్డెన్స్, ఆగస్టు 10: వందేళ్ల చరిత్రగల డాబాగార్డెన్స్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపాన అస్సాం గార్డెన్స్‌లో శివరామకృష్ణ దేవాలయం అభివృద్ధికి దూరంగా ఉంది. అప్పట్లో ములుకూరి సూరమ్మ అనే ఆమె గ్రామస్తుల సహకారంతో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి ప్రధానంగా పూజలందుకుంటున్నారు. విశ్వేశ్వరస్వామి, ఉమాదేవి ఆలయం, రామాలయం, సూర్యనారాయణస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాలు, అయ్యప్పస్వామి ఆలయం ఈ దేవస్థానంలో ఉప



నవగ్రహాల వద్ద విరిగిపోయిన టైల్స్

ఆలయాలుగా ఉన్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధిలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఆలయ నిర్మించి వందేళ్లు కావడంతో గుడి లోపల ప్రాంతాలు మరమ్మతుకు గురయ్యాయి. వర్షాకాలంలో పగుళ్లదేరిన గోడల నుంచి సైతం నీరు లోనికి వస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతోపాటు ఉమాచంద్రమౌళీశ్వరస్వామి గుడిలోని శివలింగం పానవట్టం చుట్టూ నీరు బయటకు వచ్చేస్తోంది. దీంతో అభిషేకాలు నిర్వహించే సమయంలో అసౌకర్యంగా ఉంటోంది. దీంతోపాటుగా ఆలయంలోని ఎప్పటి నుంచే ఉప ఆలయాల వద్ద ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం అభివృద్ధి చేస్తే ఎప్పుడైనా స్వామి వారి కల్యాణోత్సవం, ఇతర వేడుకలు నిర్వహించే సమయంలో భక్తులు వీక్షించేందుకు వీలుగా పలువురు అభిప్రాయపడుతున్నారు. దేవదాయ అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి ఆలయ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించాలని కోరుతున్నారు.

అనధికారిక రోడ్డు తవ్వకం అడ్డగింత



తవ్విన రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నేత కిశోర్‌కుమార్

అక్కయ్యపాలెం, ఆగస్టు 10: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రోడ్డును తవ్వకాలు చేపట్టి సొంతంగా ఓ వ్యక్తి డ్రైనేజీ నిర్మించే ప్రయత్నాలను టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, రజక సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో గెడ్డకు ఆనుకుని ఓ బిల్డింగ్ ఉంది. అందులో షాపులు నిర్వహిస్తున్నారు. ఆ భవనం యజమాని షాపుల నిర్వహణ మొత్తం ఓ వ్యక్తికి అప్పగించడంతో ఆయన అత్యుత్సాహం చూపి ఏకంగా జీవీఎంసీకి సంబంధించిన రోడ్డునే తవ్వి డ్రైనేజీ నిర్మించేందుకు సిద్ధపడ్డాడు. గమనించిన స్థానికులు కార్పొరేటర్ ముక్కా శ్రావణికి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కు సమాచారమందించారు. వెంటనే కిశోర్‌కుమార్ నిర్మాణం చేపడుతున్న స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ పనులు స్థానికులు, రజక సంఘ నాయకులతో కలిసి అడ్డుకున్నారు. తవ్విన రోడ్డును వెంటనే కప్పేయాలని చెప్పారు.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు చేపట్టేలా సిఫార్సు చేస్తానని హెచ్చరించారు.

కాపునాడు నేతను కలిసిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ



నరసింహారావు నివాసంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతమ్మధార, ఆగస్టు 10: విశాఖ జిల్లా కాపునాడు అధ్యక్షుడు గంటూరు వెంకట నరసింహారావును దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ స్నేహపూర్వకంగా శనివారం సీతమ్మధారలోని ఆయన స్వగృహంలో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. నరసింహారావు, భారతీ దంపతులు ఎమ్మెల్యే వంశీని సత్కరించారు. అనంతరం వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నరసింహారావుతో తనకు ఎప్పటి నుంచో అనుబంధం ఉందని, ఈ నేపథ్యంలోనే రాజకీయాలకు అతీతంగా కలిసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో కలిసి ముందుకు సాగుతామన్నారు. జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడానికి శంకరమఠం రోడ్డులో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ డాక్టర్ సెల్ విభాగం డాక్టర్ బొడ్డేపల్లి రఘు, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గుంటూరు చిన్ని, జనసైనికులు దుర్గ, సురేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహం సందర్శన



ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో విద్యార్థినులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 10 : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల నుంచి 25 మంది బీఎస్సీ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థినులు టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహాన్ని శనివారం సందర్శించారు. స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యక్రమాలు, వాటి నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు తెలుసుకోవడం కోసం ఈ పర్యటన చేశారు. వారికి నిరాశ్రయుల వసతి గృహాల ఏర్పాటుకు సంబంధించిన సుప్రీంకోర్టు ఆదేశాలు, నిరాశ్రయుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలు, కేస్ స్టడీస్‌ను నిర్వాహకులు వివరించారు. కళాశాల ప్రతినిధి దీపాలి, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు



నృత్యకారులతో అతిథులు

సీతంపేట, ఆగస్టు 10: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కీర్తి ఆకాడమీ ఆధ్వర్యంలో నేషనల్ లెవెల్ డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు ప్రదర్శించిన జానపద, కూచిపూడి, కటక్ నృత్యాలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ డిప్యూటీ మేయర్, కళాకారుల సంఘం అధ్యక్షులు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈసందర్భంగా నృత్య కళాకారులను అభినందించారు. అనంతరం నృత్య గురువులైన ఆర్.రజని, అనిల్ తెలికిచర్ల, సౌమ్య తెలికిచర్ల, మంగళ దివ్య, బి.సుధాపౌర్ణిమ, కరణం కుమార్‌లను అతిథులు సన్మానించారు. ఈ కార్య క్రమంలో ఎంవీ సుబ్రహ్మణ్యం, ప్రత్యూష బళ్లమూడి, బాదంగీర్ సాయి, నటుడు ప్రకాష్, ఉమేష్ చంద్ర, బిందు లిమ్మ తదితరులు పాల్గొన్నారు.

'హాస్య కథలు రాయడం కష్టం'



హాస్య కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, ఆగస్టు 10: కథలు నిజ జీవితాలకు ప్రతిబింబాలని, వీటిలో హాస్యం రాయడం కష్టమని ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 38 మంది రచయితలతో కూడిన సంకలనం హాస్యానందం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గంగాధర్ వడ్లమన్నాటి సంకలన కర్తగా రూపొందించిన ఈ పుస్తకాన్ని హాస్యానంద మాసపత్రిక సంపాదకులు పి.రాము ఆవిష్కరించి తొలి ప్రతిని కథకులు రాజేశ్వరరావుకి అందించారు. రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు సమీక్షించారు.ఈ కార్యక్రమంలో అడపా రామకృష్ణ మేడా మస్తాన్‌రెడ్డి, డాక్టర్ డీవీజీ శంకరరావు, డాక్టర్ ఎం.సుగణ రావు, నాగ వెంకట ఆంజనేయులు, బి. రత్నకుమారి, గొర్తి వాణిశ్రీనివాస్, సుసర్ల సర్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



ప్రచారంలో పాల్గొన్న ప్రతినిధులు

కంచరపాలెం, ఆగస్టు 10 : జీవీఎంసీ 47వ వార్డు పరిధి రాంజీఎస్టేట్ గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హెర్బాన్ న్యూ లైఫ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొని దాతలనుంచి రక్తం సేకరించారు. సేకరించిన రక్తాన్ని విశాఖ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. పాస్టర్ మనీకుమార్ విలియమ్స్, ఇబ్రాయిల్, వార్డు టీడీపీ నాయకుడు రాజారావు తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి కృషి చేశారు. కాలనీలో అవగాహనకల్పించారు.

రైతు ప్రాముఖ్యత తెలుసుకోవాలి



నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ రవికిరణ్

సీతంపేట, ఆగస్టు 10: ప్రతి విద్యార్థీ రైతు పండించే పంటలను, వారి కష్టాలను తెలుసుకోవాలని డాక్టర్ వై.రవికిరణ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో వరి, కూరగాయలు, చిరుధాన్యాలు తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్, వ్యవసాయం ప్రాముఖ్యతను తెలిపే నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వై.రవికుమార్ ఈ నమూనాలు పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల చైర్మన్ సుబ్రహ్మణ్యం, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, సీజీఎం వసంత అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ సుధాలత, ప్రిన్సిపాల్ గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

సీతంపేట, ఆగస్టు 10: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సతీ సమేతంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయ సిబ్బంది గ్రంథాలయంలోని విభాగాలను, వసతులు, విద్యార్థులకు అందుబాటులో ఉంచిన పుస్తకాలను, గ్రూప్ పరీక్షల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను చూపారు. గ్రంథాలయం నిర్వహణ బాగుందని శంకరరావు ఆనందం వ్యక్తం చేశారు.

పేదలకు వైద్య నిపుణుల సేవలు దూరం

- పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల వైద్యం బంద్
- వైసీపీ పాలనలో నిర్ణయంతో ఇబ్బందులు

జగదాంబ కూడలి, ఆగస్టు 10: గ్రేటర్ విశాఖ పరిధిలో పేదల కోసం ఏర్పాటైన పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల వైద్య సేవలకు బ్రేక్ పడింది. ఎన్నికల ముందు గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ ఆరోగ్య కేంద్రాలను గత ప్రభుత్వంఅందుబాటులోకి తీసుకువచ్చింది.ఇందులో భాగంగా కనకమహాలక్ష్మి గుడిసమీపాన బురుజుపేట, పాతపోస్టాఫీసు, రెల్లివీధి వద్ద పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గతంలో ఈ కేంద్రాల ద్వారా వారంలో



పాతపోస్టాఫీసు వద్ద పట్టణ ఆరోగ్య కేంద్రం

ఒకరోజు ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, న్యూరోతోపాటు మరికొన్ని స్పెషాలిటీ వైద్యసేవలు రోగులకు అందుబాటులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలలముందు ఈ ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్య సేవలను పూర్తి నిలిపివేసింది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు స్పెషాలిటీ వైద్యం అందడంలేదు. పెద్దాసుపత్రికి వెళ్లలేని పరిస్థితుల్లో అనారోగ్యంతో బాధపడుతున్నట్టు రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైద్య నిపుణుల సేవలు లేక ఈ కేంద్రాలకువచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తిరిగి స్పెషాలిటీ వైద్య సేవలనుఅందుబాటులోకి పలువురు కోరుతున్నారు.

ఏయూ మాజీ ఓఎస్‌డీ సిత్రాలు

... 5వ పేజీ తరువాయి

గత వీసీ రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అవకాశాన్ని కల్పించారు. రిజిస్ట్రార్ బాధ్యతలు నుంచి తప్పుకున్న తరువాత ఓఎస్‌డీ పేరుతో ప్రత్యేకంగా పోస్టును సృష్టించి ఆయన్ను నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జూన్ నెలాఖరులో వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ పదవులకు ప్రసాదరెడ్డి, జేమ్స్ స్టీఫెన్, కృష్ణమోహన్ రాజీనామా చేశారు. అయితే, అంతర్జాతీయంగా పలు దేశాల్లో జరుగుతున్న కాన్ఫరెన్స్‌లకు మాత్రం కృష్ణమోహన్ ఇప్పటికీ ఓఎస్‌డీ హోదాలోనే హాజరవుతుండడంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

దారితప్పుతున్న యువత

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. ఈ తరహా యాప్‌లు, కొందరు అప్పులు క్లియర్ చేసినా వారిని వేధింపులకు గురి చేస్తున్నాయి. ఇదిలావుండగా సులభంగా అప్పులు దొరుకు తుండడంతో ఇంట్లో తెలియకుండానే చాలామంది ఈ తరహా దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. ఈ అప్పులు భవిష్యత్తులో వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్న విషయాన్ని గ్రహించడం లేదు.

ఆర్థిక అవసరాలపై దృష్టి అవసరం

పిల్లల ఖర్చుపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. అప్పుడే ఈ తరహా వ్యసనాలకు ప్రాథమిక దశలోనే అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. ఖరీదైన వస్తువులు కొనుగోలు చేయడం, ఇంట్లో అవసరాలను తీర్చే పనులు చేయడం, ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు అడగకపోవడం, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బులు అడగడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, ఒంటరిగా ఉండేందుకు యత్నించడం వంటివి చేస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. కొన్నిసార్లు బంధువులు వద్ద కూడా అప్పులు చేస్తుంటారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే వేగంగా వాటి నుంచి దూరంగా ఉండేలా చేయవచ్చునని చెబుతున్నారు. ఆలస్యం అయితే ఆర్థికంగా తీవ్రస్థాయిలో నష్టపోవడంతోపాటు కొన్నిసార్లు పిల్లల ప్రాణాలు కోల్పోవచ్చునని చెబుతున్నారు.

పిల్లల ఆర్థిక అవసరాలను నిశితంగా గమనించాలి

- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి

గతంతో పోలిస్తే పిల్లలు వ్యవహారశైలిలో పూర్తిగా మార్పు వచ్చింది. కుటుంబ పరిస్థితి, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆడంబరాలకు పోతున్నారు. అదే ప్రమాదానికి హేతువుగా మారుతోంది. పెద్దింటి పిల్లలతో సమానంగా బతకాలనే ఆలోచనలో నుంచి పుట్టుకు వస్తున్నవే ఈ తరహా దురలవాట్లు. ఎవరో ఆడుతున్నారని వీళ్లు నేర్చుకుంటున్నారు. డబ్బులు లేక పోతే అప్పులు చేస్తున్నారు. కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు కూడా పిల్లలు ఆనందంగా ఉండాలని ఆర్థిక పరి స్థితులకు మించి వారి అవసరాలను తీరుస్తున్నారు. వేలాది రూపాయల ఫోన్లు, బైక్‌లు కొనిస్తున్నారు. ఇవి దురలవాట్ల వైపు పిల్లలు మొగ్గేలా చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ అవసరాలకు డబ్బులు ఇవ్వకపోతే కొందరు పిల్లలు అప్పులు, రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల కిందట హైవేపై దొంగతనాలకు పాల్పడుతున్న 15 మందిని పట్టుకున్నారు.వీరంతా చదువుకుంటున్నవాళ్లే.దొంగతనాలు చేయడానికి కారణాలు తెలుసుకుంటే ఆన్‌లైన్ గేమ్స్, ఖరీదైన బైక్స్ మెయింటెనెన్స్ కోసం అని చెప్పారు. ఇటువంటి వ్యవహారాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు మోరల్ వాల్యూస్ చెప్పాలి.ఆర్థిక స్థితిగతులు, తమ కుటుంబ పరిస్థితులు వివరించాలి. మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లు వల్ల కలిగే అనర్థాలను చిన్న వయసులోనే తెలియజేయాలి.

స్మార్ట్ మీటర్లు

... 5వ పేజీ తరువాయి

అధికారులు కార్యాలయం నుంచి తెలుసుకోవచ్చు. స్మార్ట్ మీటరు ఏర్పాటుచేసుకున్న వారు దానిని మొబైల్‌లాగే ముందుగా డబ్బులు కట్టి రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెలా పది నుంచి పదిహేను రోజుల వ్యవధిలో బిల్లులు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక..అలా కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తున్నదో సగటున అంచనా వేసి, ఆ మొత్తం ముందుగానే చెల్లించి మీటరును రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ఆ మొత్తం ఎంత అనేది వినియోగం బట్టి మారుతుంది. ఒక్కోసారి అధికంగా విద్యుత్‌ను ఉపయోగిస్తే రీచార్జి చేసుకున్న మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయాల్లో వినియోగదారుల మొబైల్‌కు సమాచారం పంపిస్తారు. వినియోగించిన విద్యుత్, రీచార్జి చేసిన మొత్తం, ఇంకా ఎంత రీచార్జి చేసుకోవాలో తెలియజేస్తారు. దీనివల్ల విద్యుత్ పంపిణీ సంస్థలకు 100 శాతం బిల్లింగ్, పేమెంట్ జరుగుతుంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల నుంచి బయటపడడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూళ్లు

ప్రస్తుతం విద్యుత్ పంపిణీ సంస్థలకు వాణిజ్య, గృహ వినియోగదారుల నుంచి బిల్లుల వసూళ్లలో పెద్దగా సమస్యలు లేవు. 98 శాతం వసూలైపోతున్నాయి. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలే బిల్లులు ఏళ్ల తరబడి కట్టడం లేదు. బకాయిలు కోట్ల రూపాయల్లో ఉన్నా పంపిణీ సంస్థలు చర్యలు చేపట్టలేకపోతున్నాయి. ఇతర వినియోగదారుల్లా సరఫరా నిలిపివేయడం, నోటీసులు ఇవ్వడం వంటివి చేయలేకపోతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటీ పార్కులో ఇన్నోవేషన్ సొసైటీ కలసి రూ.10 కోట్ల మొత్తం చెల్లించాల్సి ఉంది. అయినా వాటికి సరఫరా ఇస్తూనే ఉన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే ఇలాంటి బకాయిల బెడద ఉండదు. ఆయా సంస్థలు కూడా ముందుగానే వారి మీటర్లను రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రతి కార్యాలయం అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటుంది. అందుకే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యాంబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఏయూలో మాజీ వీసీ హవా!?

... 5వ పేజీ తరువాయి

వివరణలు అడుగుతున్నారని, తాను సమాధానం చెప్పుకోవలసి వస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీ పద్ధతి మార్చుకోకపోతే వేరే విభాగానికి బదిలీ చేస్తా' అంటూ హెచ్చరించి పంపించారు. అదేరోజు సాయంత్రం ఆ అధికారి కార్యాలయం నుంచి విలేకరులకు ఫోన్లు వచ్చాయి. సీఎస్ఈ విభాగంలో 12 మందిని వేరే సెక్షన్‌కు బదిలీ చేసినట్టు సమాచారం ఇచ్చారు. వారంతా విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, దానిపై గవర్నర్‌కు ఫిర్యాదు వెళ్లిందని, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. ఇదే విషయం శనివారం అన్ని పత్రికల్లో రావడంతో ఆ 12 మంది ఆశ్చర్యపోయారు. ప్రసాదరెడ్డికి సంబంధించిన సమాచారం బయటకు ఇస్తున్నందుకు చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారని, కానీ డబ్బులు వసూలు చేస్తున్నందుకు చర్యలు తీసుకున్నామని పత్రికలకు చెప్పడం ఏమిటని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని, దీనిపై ఉన్నతాధికారులను కలిసి మాట్లాడతామని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విద్యార్థుల నుంచి వసూళ్లపై గవర్నర్ చర్యలా?

విద్యార్థులు సరిగా కాలేజీకి రారని, వారికి అటెండెన్స్ విషయంతో ఈ దిగువ స్థాయి సిబ్బంది సాయం చేసి డబ్బులు తీసుకుంటారనేది సదరు అధికారి ప్రధాన ఆరోపణ. అయితే ఇలా తక్కువ అటెండెన్స్ ఉన్నవారిని గుర్తించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేయడం ఆచరణలో ఉన్న విధానం. అప్పటికీ అటెండెన్స్ సరిపోకపోతే హెచ్‌ఓడీలే వారితో అపరాధ రుసుము కట్టించుకుంటారు. ఇది అన్ని విభాగాల్లో జరిగేదే. ఒక్క సీఎస్ఈలోనే ఇది జరుగుతున్నట్టుగా చెప్పడం, దానికి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపించడంపై పలువురు ప్రొఫెసర్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఏయూలో అడ్డగోలు నియామకాలు, నిధుల దుర్వినియోగం, అనర్హులకు పీహెచ్‌డీల ప్రదానం వంటి అంశాలపై గవర్నర్‌కు ఇరవైకి పైగా ఫిర్యాదులు పంపామని, వాటిపై కాకుండా అటెండర్లపై చర్య తీసుకోవాలని గవర్నర్ ఆదేశించారని చెప్పడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. తక్షణమే వారి సెక్షన్ మార్పును ఆపాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారిని దండించాలి గానీ ఎవరినో కాపాడడానికి ఇలాంటి చర్యలకు దిగడం వివాదాన్ని పెద్దది చేయడమే అవుతుందని అభిప్రాయపడ్డారు.

వృద్ధులకు వితరణ

పూర్ణామార్కెట్, ఆగస్టు 10: టీడీపీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు స్టాండింగ్ కమిటీ మెంబరుగా ఎన్నికైన సందర్భంగా శనివారం గ్రేటర్ 39 వార్డులో ఉన్న స్వామివివేకానంద ఆశ్రమంలో పరిసర ప్రాంత పేదలు, వృద్ధులకు అన్నదానం, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తి మంగరాజు, సురేష్, నిమ్మశ్రీనివాస్ పాల్గొన్నారు.



అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 10 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవిలతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తొలుత నృసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో పూజ చేశారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి గరుడ సేవ జరిపారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నర్సింగ్ అభ్యర్థినులకు శిక్షణ

ఆరిలోవ, ఆగస్టు 10 : పైనాపిల్ కాలనీలో ఉన్న మహిళా ప్రాంగణంలో 32 మంది నర్సింగ్ అభ్యర్థినులకు శిక్షణ ఇస్తున్నట్టు ప్రాంగణాధికారి పి. విమల తెలిపారు. శనివారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. 2019 నుంచి మహిళా ప్రాంగణంలో వివిధ వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి శిక్షణ అందిస్తున్నామని, ఇప్పటివరకు 13 బ్యాచ్‌లు శిక్షణ పొందాయని వివరించారు. పది, ఇంటర్ పూర్తయిన వారికి మూడు నెలలు పాటు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 18 నుంచి కొత్త బ్యాచ్ మొదలవుతుందని, ఆసక్తి గల వారు కార్యాలయంలో సంప్రతించాలని ఆమె సూచించారు.

మొక్కలు నాటిన వాకర్స్

భీమునిపట్నం, ఆగస్టు 10 : పట్టణంలోని చిన్న బజారు జమ్మి చెరువు ఉద్యానవనంలో జమ్మి చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం మొక్కలు నాటారు. గట్టు చుట్టూ వివిధ రకాలకు చెందిన 52 మొక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు నెయిగాపుల జనార్దనరావు, కదిరి జగన్నాథం, గాడు సన్యాసినాయుడు, గుర్రాల పండరీనాథ్, శేషాద్రి, కృష్ణవర్మ, టి.అప్పారావు, అప్పలనాయుడు, తాతారావు, శంకర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు



పెదవాల్తేరు, ఆగస్టు 10 : జీవీఎంసీ 21వ వార్డు ఏయూ అవుట్ గేట్ డౌన్ కల్యాన్ నగర్‌లో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి వెండి ధనస్సు స్పర్శ దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఏడు అడుగుల పొడవు ఉన్న ఈ వెండి ధనస్సును చల్లా శ్రీనివాస్ శాస్త్రీ సుమారు 26 కిలోలతో తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో వన్నె రాంబాబు, గండేపల్లి రాజు, అప్పారావు, కృష్ణారావు, కె. సత్యనారాయణ, పి. వెంకటేశ్వరరావు, బి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనంత పద్మనాభునికి వసతి కరువు

- నిలిచిన ఆలయ గోపురం పునర్నిర్మాణం
- నిలువ నీడ లేని స్వామివారు
- సత్వరమే పూర్తి చేయాలని భక్తుల డిమాండ్



అసంపూర్తిగా ఉన్న ఆలయ గోపురం పునర్నిర్మాణ పనులు

పద్మనాభం, ఆగస్టు 10 : పద్మనాభం గిరిపై వెలసిన అనంత పద్మనాభుడి ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. స్వామివారి మూలవిరాట్టు ఎండకు ఎండి, వానకు తడిచే విధంగా విడిచిపెట్టేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వల్లే ఇటువంటి అపచారం జరిగిందని విమర్శిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టలేని వారు అసలు గోపురాన్ని ఎందుకు కూల్చారని నిలదీస్తున్నారు. 2018లో ఆలయంపై పిడుగు పడడంతో ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆదేశాల మేరకు దేవస్థానం అధికారులు అంచనాలు రూపొందించారు. అప్పటి అంచనాల ప్రకారం పునాదులతో సహా గోపురం పూర్తి నిర్మాణానికి రూ.60 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి దేవాదాయ శాఖ సర్వశ్రేయోనిధి నుంచి నిధులు మంజూరు చేయించడానికి దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. ఈ మొత్తంలో 20 శాతం దేవస్థానం కట్టాల్సిన వాటా రూ. 12 లక్షలను సింహాచలం దేవస్థానం నుంచి చెల్లించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే నాలుగేళ్ల పట్టించుకోకుండా విడిచిపెట్టి గత ఏడాది హడావిడిగా దేవాదాయ శాఖ నుంచి నిధులు విడుదల చేయించి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు భూమి పూజ చేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ శిథిలమైన గోపురాన్ని తొలగించి, కొత్త గోపురం నిర్మాణానికి ఉపక్రమించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎన్నికల ఫలితాలు వచ్చి సుమారు రెండు నెలలు కావస్తున్నా.. నేటికీ నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో స్వామివారికి నిలువ నీడ లేకుండా పోయింది. ప్రస్తుత పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టిసారించి యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, సెప్టెంబరులో జరిగే అనంత పద్మనాభుని జయంత్యుత్సవం నాటికి సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఆలయ ఈఓ నానాజీబాబును వివరణ కోరగా వర్షాల వల్ల పనులు నిలిచిపోయాయని, వర్షాలు తగ్గిన వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా బీఆర్‌టీఎస్ రోడ్డు

- నగరమంతా ఒకలా.. సింహాచలంలో మరోలా పనులు
- రెండు రోడ్ల మధ్య కానరాని డివైడర్లు
- తరచూ ప్రమాదాలతో భయాందోళన



రెండు రోడ్ల మధ్య కానరాని డివైడర్

సింహాచలం, ఆగస్టు 10 : జీవీఎంసీ 98వ వార్డులోని సింహాచలం పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. పదేళ్ల పాటు నిలిచిపోయిన సింహాచలం కారిడార్ పనులను గత ఏడాది నవంబరు నుంచి ప్రారంభించారు. నగరమంతా రోడ్డు మధ్యన రెండు వరుసల్లో బస్సులు వెళ్లేందుకు, ఇరువైపులా రెండు రోడ్లు కార్లు, బైక్‌లకు సర్వీసు రోడ్లుగా నిర్మించారు. సింహాచలం కారిడార్‌లోనూ తొలుత అదే రీతిన నిర్మించాలని జీవీఎంసీ అధికారులు భావించినా.. ఆ తరువాత ఎందుకనో ప్రణాళిక మార్చారు. కొందరు వ్యాపారులతో జరిగిన కుమ్మక్కు వల్లే ప్లానింగ్ మార్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడ రెండు రోడ్లు మాత్రమే నిర్మిస్తున్నారు. ఇలా చేయాలంటే ముందు కౌన్సిల్ తీర్మానం చేయాలి. కానీ అదేదీ లేకుండానే అధికారులు పనులు కానిస్తున్నారు. రోడ్డు పనులను తొలుత మే 10 నాటి అప్పన్న స్వామి నిజరూప దర్శనం చందనోత్సవం షాక్‌గా చూపి పరుగులు పెట్టించారు. దీంతో 60 శాతం పనులు పూర్తయ్యాయి. తరువాత కొద్దిరోజులు పనులు నెమ్మదిగా సాగినా జూలై 21న జరిగిన సింహగిరి ప్రదక్షిణ ఉత్సవాన్ని కారణంగా చూపి కాంట్రాక్టర్ మరోసారి పనులను వేగవంతం చేశారు. దీంతో మరో 10 శాతం పనులు పూర్తి చేశారు. తరువాత గత 15 రోజులుగా పనులు పూర్తిగా పడకేసాయి. దీంతో రోడ్డులో ప్రయాణించే వాహనాల వేగానికి నియంత్రణ లేకుండా పోతోంది. ఇప్పటివరకు ఇక్కడ ఐదు ప్రమాదాలు జరిగాయి. వాటిలో గత నెల 29న కుమ్మరి వీధి సమీపాన జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. రోడ్డు పరిధిలో ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, మూడు రోడ్లు కాకుండా రెండు రోడ్లు ఉండడం, మధ్యలో డివైడర్లు లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు పనులను సత్వరమే పూర్తి చేయడంతో పాటు వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, నగరమంతా ఉన్నట్టే ఇక్కడ కూడా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని రైతుబజార్

రైతుబజార్ ప్రారంభోత్సవంలో జాప్యం

తగరపువలస, ఆగస్టు 10 : తగరపువలసలో రైతుబజార్ నిర్మాణం పూర్తయినా ప్రారంభించకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం సంగివలస వద్ద రైతుబజార్ నిర్మాణానికి ప్రతిపాదించగా స్థల సేకరణ, ఇతర సమస్యల వల్ల ఏడాది క్రితం వరకు పనులు ప్రారంభం కాలేదు.ఆరు నెలలు క్రితం మూడెకరాల స్థలంలో దీన్ని పూర్తిచేశారు. దుకాణాలు, కూరగాయల విక్రయాలకు వీలుగా రేకుల షెడ్లు, ఎస్టేట్ అధికారి కార్యాలయం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించారు. నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తుందన్న సమయంలో ఎన్నికల వల్ల వాయిదా పడింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రైతుబజార్ ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శరవేగంగా అన్న క్యాంటీన్ ఆధునికీకరణ పనులు

కొమ్మాది, ఆగస్టు 10 : జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని మారికవలస రాజీవ్ గృహ కల్ప కాలనీలోను, ఏడో వార్డు వాంబే కాలనీలో అన్న క్యాంటీన్ల ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈమేరకు ఆయా క్యాంటీన్లను సుమారు రూ. 35 లక్షల జీవీఎంసీ నిధులతో సర్వాంగ సుందరంగా ఆధునికీకరిస్తున్నారు. కిచెన్, డైనింగ్ టేబుళ్లు, క్యాంటీన్ చుట్టూ టైల్స్ పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆరో వార్డులో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అక్కడి స్థానికులు కోరుతున్నారు.

లక్ష్మీనారాయణ ఆలయంలో సుదర్శన యాగం

ఆరిలోవ, ఆగస్టు 10 : పాత డెయిరీ ఫారానికి సమీపంలో ఉన్న లక్ష్మీనారాయణ ఆలయంలో శనివారం సుదర్శన యాగం నిర్వహించారు. ప్రతి నెలా స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని యాగం చేయడం ఆనవాయితీ. ఈమేరకు ముందుగా ఆలయ అర్చకుడు ఆరవిల్లి ఆచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణలకు ప్రత్యేక పూజలు, అభిషే కాలు జరిపారు. అనంతరం యాగం చేపట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తిలకధారణ తప్పనిసరి

సింహాచలం, ఆగస్టు 10 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పనిచేసే వారంతా తప్పనిసరిగా తిలకధారణ చేయాల్సిందేనని హైందవ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోని కొన్ని ఆలయాల్లో చిరు వ్యాపారులుగా కొందరు అన్యమతస్తులు ప్రవేశిస్తున్నారని, అటువంటి వారిని నిలువరించాలంటే హిందువుల ఆచార సంప్రదాయాలను ఆలయాల పరిధిలో పని చేసేవారంతా ఆచరించేలా అధికారులు కఠిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా దేవస్థానం పరిధిలోని లీజెస్ విభాగం ద్వారా వివిధ వ్యాపారాలు చేసుకునే హక్కు పొందిన కాంట్రాక్టర్లు, వారి వద్ద పనిచేస్తున్న వారు, ఆలయ పరిసరాల్లో పువ్వులు, తులసీ, ఫొటోలు, తదితర చిరు వ్యాపారులు అనేక మంది నుదటన తిలకధారణ లేకుండా ఉండటాన్ని ఆక్షేపిస్తున్నారు.

నారాయణ విద్యా సంస్థల సిబ్బందికి స్పోర్ట్స్ మీట్



స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న నారాయణ విద్యా సంస్థల సిబ్బంది

రామ్‌నగర్, ఆగస్టు 10 : బీచ్ రోడ్డులోని వుడా పార్కులో నారాయణ విద్యా సంస్థల సిబ్బంది స్పోర్ట్స్ మీట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆ విద్యా సంస్థల ఏజీఎం రాజ్ కుమార్ ఈ వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అందుకే సిబ్బందికి, విద్యార్థులకు ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు, 13 బ్రాంచ్‌లను రెండు క్లస్టర్లగా విభజించి పోటీలు జరుపుతు న్నామని, వీటిలో 400 మంది సిబ్బంది పాల్గొన్నట్టు చెప్పారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, షటిల్ వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

'శ్మశానవాటికలో హెచ్చరిక బోర్డు సరికాదు'

భీమునిపట్నం, ఆగస్టు 10 : పట్టణంలోని జీవీఎంసీ అధికారులు మత్స్యకా రుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు ఆరోపించారు. శనివారం ఆయన బీచ్ రోడ్‌లో వున్న పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అయిదు శతాబ్దాలుగా బీచ్ రోడ్‌లో ఉన్న జల గెడ్డ ప్రాంతాన్ని మత్స్యకారులు శ్మశానవాటికగా వినియోగిస్తున్నారని చెప్పారు. ఇటీవల శ్మశానవాటికకు ముందు భాగంలో రెస్టారెంట్ నిర్వహిస్తున్న యాజమాన్యానికి అనుకూలంగా జోనల్ కార్యాలయం అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, మృత దేహాలను ఖననం చేయరాదని చెప్పడం సమంజసం కాదన్నారు. ఆ స్థలం బే ఆఫ్ బెంగాల్‌కు చెందిందని, రెస్టారెంట్ యాజమాన్యానికి సంబంధం లేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

CLASSIFIEDS

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

కొమ్మాది, ఆగస్టు 10 : కేరళలోని వయనాడ్‌లో వరద బాధితులను ఆదుకోవడానికి పీఎంపాలెం మాలతాంబా విద్యానికేతన్ విద్యార్థులు శనివారం విరాళాలు సేకరించారు. పీఎంపాలెం కార్‌షెడ్ కూడలి నుంచి ఆఖరి బస్టాప్ వరకు ర్యాలీ నిర్వహించి, విరాళాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో విద్యానికేతన్ జనరల్ మేనేజర్ జీపీఆర్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడీ, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 29, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 140, బరబటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 28, కీరదోస 30, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	78
ఫారం ధర	--	98
విత్ స్కిన్	--	166
స్కిన్‌లెస్	--	176

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

వీహెచ్‌పీ సత్సంగ్ జిల్లా అధ్యక్షుడిగా కనకల

భీమునిపట్నం, ఆగస్టు 10 : విశ్వ హిందూ పరిషత్ అనుబంధ విభాగ్ సత్సంగ్ సమితి జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కనకల సన్యాసినాయుడు నియమితులయ్యారు. గత 35 ఏళ్లుగా ఆయన వీహెచ్‌పీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. శనివారం విజయనగరం పట్టణంలోని ఎన్‌సీఎస్ రోడ్‌లో జరుగుతున్న సత్సంగ్ రాష్ట్ర సమావేశాల సందర్భంగా ఆయన్ను విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ గ్రామ వికాస జిల్లా అధ్యక్షుడు గాడు వెంకటప్పడు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి జివి నారాయణ, తదితరులు ఆయన్ను అభినందించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

పెదవాల్తేరు, ఆగస్టు 10 : జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం పురస్కరించుకుని చినవాల్తేరులోని లిల్లీ వైట్స్ క్లబ్ గ్రంథాలయానికి సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరినాయుడు శనివారం పలు పుస్తకాలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం జీవితంలో దిన చర్యగా మార్చుకుంటే మంచి పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు, యువత పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లిల్లీ వైట్స్ క్లబ్ అధ్యక్షుడు బొట్టా వేణుగోపాలరావు, సెక్రటరీ అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఒమ్మి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు వీల్‌చైర్లు ..

ఎంవీపీ కాలనీ : గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కళాశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ సభ్యులు పది వీల్ చైర్లు వితరణగా అందించారు. శనివారం ఎంవీపీ కాలనీలోని గాయత్రి కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎండీ యాసిన్, సీహెచ్ నేతాజీ, కిషోర్ కుమార్, ఆకుల శ్రీనివాస్, తదితరులు గాయత్రి కళాశాల వైస్ చైర్మన్ డిట్టకవి దక్షిణామూర్తి, కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజులకు వీల్ చైర్లు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సత్య వర ప్రసాద్, డాక్టర్ ప్రసాద్, పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతి ఆశ్రమంలో దివ్యాంగ విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఓంకార్ లైన్స్ హెచ్‌ఎస్ ఫర్ ది డఫ్ అండ్ డంబ్ స్కూల్, స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ పోటీలు జరిపాయి. ఈ కార్యక్రమంలో స్థిత ప్రజ్ఞ మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు ప్రదీప, దుర్గబాబు, గణేష్, నవీన్, రామ్‌కుమార్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీదేవి, ఎస్వీ లక్ష్మి, ఎంవీ లక్ష్మి, దివ్య, శిరీషా పాల్గొన్నారు.